# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# ఆగం కావొద్దు..

## హస్తాన్ని మాయంచేద్దాం..

- వ్యవసాయాన్ని నాశనం చేసేలా పీసీసీ చీఫ్ వ్యాఖ్యలు
- మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లపై రైతుల మండిపాటు
- కాంగ్రెస్ హయాంలో పడ్డ గోసలు మర్చిపోలేమంటున్న అన్నదాతలు



### 10హెచ్‌పీ కొనాలంటే లక్ష కావాలె..

మాచారెడ్డి, నవంబర్ 22: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ కరెంట్ తిప్పలు తప్పవు. రాత్రిపూట పొలాలకు పోవాల్సిన పరిస్థితి వస్తుంది. మూడు గంటలు కరెంట్ ఇస్తే పొలాలు సరిగ్గా పండక అప్పుల పాలవుతాం. 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. మళ్లీ అప్పుజేసి మోటరు పెట్టుకోవాలా? కాంగ్రెస్ వస్తే రైతులు అప్పులపాలు కావడమే. గీ పదేండ్లలో సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ ఉచితంగా ఇచ్చిండు. మళ్లీ ఆయనొస్తేనే కరెంటు మంచిగ వస్తుంది.. పంటలు మంచిగ పండుతాయి.

**-వెంకటరామారావు,**
**రాచమల్ల,ఘన్‌పూర్,మాచారెడ్డి మండలం**



### నిరంతర విద్యుత్‌తో సంతోషంగా ఉన్నాం..

ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో సంతోషంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. కరెంటు లేకపోతే ఎనుకటి కాలం వస్తది. ఒక వేళ కాంగ్రెస్ పార్టీ వచ్చి 3, 5 గంటల కరెంటు వచ్చిందా, రైతులందరం కరెంటు ఎప్పుడు వస్తుందా? ఎప్పుడు మోటరు వేయాలని ఎదురుచూడాల్సి వస్తుంది. కరెంటు రాంగనే అందరం ఒక్కసారే మోటర్లు వేస్తే స్టాటర్లు, బోర్లు కాలిపోతాయి. మళ్లీ బోర్ల రిపేర్ కోసం అప్పులపాలై వలస పోవాల్సిన పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్‌కు ఓటేసి ఆ బాధలు పడాల్సిన అవసరం ఏం ఉన్నది. మంచిగ చేస్తున్న కేసీఆర్‌ను మరో సారి గెలిపించుకుంటాం.

**- నర్సింహారెడ్డి, రైతు, వెల్గనూర్**

### మళ్లీ పాత కథనే మొదలైతుంది..

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవు. మూడు గంటల కరెంట్‌తో అర ఎకరం కూడా నీళ్లు పారవు. అంతలోనే కరెంట్ పోతది. మళ్లీ కరెంట్ వచ్చేసరికి మొదటి నుంచి పారుతది. పారిన గుంటలోనే మళ్లీ పారుతుంది. ఇదే కథ నడుస్తది. పొలమంతా నీళ్లు పారాలంటే ఒక్కరోజులో అయ్యే పని.. నాలుగు రోజుల వరకు అవుతుంది. వ్యవసాయం గురించి తెలిసిన వాళ్లయితే మూడు గంటల కరెంట్ సరిపోతుందని చెప్పడం మూర్ఖత్వమే అవుతుంది.

**-విస్లావత్ షప్లీ, కాకులగుట్టతండా,**
**మాచారెడ్డి మండలం.**





### కాంగ్రెస్ వస్తే.. పంటలు ఎండుడే..

పిట్లం, నవంబర్ 22: కాంగ్రెసోళ్లు చెబుతున్నట్లు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోదు. గతంలో కాంగ్రెస్ పాలనలో అవస్థలు పడ్డాం. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ పాలన వస్తే కరెంటు సరిపోక.. పంటలు ఎండిపోతాయి. ఇంకా ఇప్పుడు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. ఆ మోటర్లు కొనాలంటే అన్ని పైసలు ఉండాలె కదా రైతుల దగ్గర. ఆ మోటర్లు వాడే సమయంలో కరాబ్ అయితే రిపేర్లకు పెట్టే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఇదంతా అవసరమా? ఇప్పుడే సౌలత్ ఉన్న కరెంటు వస్తున్నది. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండు. ఏటైంల పోయినా బోరు చాలు చేసుకోవడమే. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మం. కేసీఆర్ ఉంటేనే రైతు సుభిక్షంగా ఉంటాడు.

**- భాస్కర్, పిట్లం**





### కాంగ్రెస్ మాటలు నమ్మితే తిప్పలు తప్పవు..

వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే మా బతుకులు పొలంలోనే తెల్లారుతాయి. ఎప్పుడు కరెంట్ వస్తదో ...పొలానికి నీరు పారవెట్టుకుందామా అని పొలంలోనే ఉండాల్సి వస్తుంది. కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయం చేస్తే తెలుస్తుంది. రైతులకు ఎన్ని గంటల కరెంట్ అవసరమో వాళ్లకేం తెలుసు. రైతుబిడ్డ కేసీఆర్ కాబట్టి ఆయనకు మొత్తం తెలుసు. అందుకే 24గంటల ఉచిత కరెంటు ఇస్తుండు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే తిప్పలు తప్పవు.

**-ఏలేటి మధుసూదన్ రెడ్డి,రైతు,**
**ఆరెపల్లి, పాల్వంచ మండలం.**

### రేవంత్‌రెడ్డికి ఎవుసం ఏం ఎరుక..

నిజాంసాగర్, నవంబర్ 22: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఎవుసం ఏం ఎరుక. మూడు గంటల కరెంటు రైతులకు సరిపోదు. మేం వాడేదే 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు.. ఇప్పుడొచ్చి 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలని మాకు గాయన చెప్పుడేందో. అసలు పొలంల 10హెచ్‌పీ మోటరు వాడమంటేనే అర్థమైతాంది వాని తెలివి. మోటర్ల కథ మొత్తం మా రైతులకు ఎరుక. వానికేం ఎరుక. 10హెచ్‌పీ మోటరు వాడితే దానికయ్యే ఖర్సు కాంగ్రెసోళ్లు భరిస్తరా? అధికారం ఇచ్చినంక మా నెత్తిమీద పడేసి.. మీ సావు మీరు సావండి అని పోతరు. గీళ్ల పాలన ఎట్లుంటదో మాకు తెల్వంది కాదు. అప్పట్ల దొంగరాత్రి కరెంటు ఇచ్చి.. మా రైతుల పానాలు తీసింది వీళ్లే కాదా? ఇప్పుడు ఎలక్షన్ల గెల్వడానికి కొత్తకొత్త కథలు చెప్తె.. వినడానికి మా రైతుల చెవుల పూలైతే కనిపిస్తలేవు కదా. నేను పుట్టిన నుంచి ఇప్పటి వరకు రైతులను మంచిగ చూసుకున్న ప్రభుత్వం, లీడర్ ఉన్నడంటే.. గీ బీఆర్ఎస్ పార్టీనే.. కేసీఆర్ సారే. అంత మంచి సారును ఇడిసిపెట్టి.. గీళ్లకు అధికారం ఇస్తామా? కాంగ్రెసోళ్లు వద్దేవద్దు.. బీఆర్ఎస్ పార్టీనే ముద్దు.

**- జయంత్‌రెడ్డి, మల్లూర్, నిజాంసాగర్**



### 10హెచ్‌పీతో ఎవుసం దండుగైతది..

పొలానికి నీరు పారిచ్చేందుకు 5హెచ్‌పీ మోటర్లు అయితే సరిపోతది. కాంగ్రెసోళ్లు వచ్చి 10హెచ్‌పీ మోటరు పెట్టుకొని మూడు గంటల్ల పొలమంతా పారించవచ్చని బట్టేబాజ్ మాటలు చెబుతున్నారు. అసలు 10హెచ్‌పీ మోటర్లు చెరువులు, కాలువల్లోని నీటిని తీసేందుకు వాడతారు. వాటిని పొలాల్లో ఏ రైతూ వాడరు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లలో ఉన్న నీళ్లన్నీ ఒక్కసారికే ఖతం అయితాయి. బోరు వట్టిపోతది. ఎవుసం దండుగైతది.

**-మాలోత్ మంగ్యా, కాకులగుట్ట తండా,**
**మాచారెడ్డి మండలం**

### అర్ధరాత్రి పొలానికి పోయే పరిస్థితి వస్తుంది..

మూడు గంటల కరెంట్ ఇస్తే ఎవుసం ఎట్ల చేస్తం. కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంట్ మంచిగున్నది. ఎప్పుడు పడితే అప్పుడు పొలంకాడికి పోయి మోటర్ వేసి నీళ్లు పారించుకుంటున్నం. కాంగ్రెస్ నాయకులు గెల్వకముందే రైతుల బతుకులను ఆగం చేస్తున్నారు. కాంగ్రెసోళ్లు గెలిస్తే మూడు గంటలు అన్నోడు గంట కూడా ఇవ్వడు. అప్పుడు రైతుల పరిస్థితి ఏంటి. రైతుల బతుకులు ఆగం కావొద్దంటే కేసీఆరే మళ్లీ సీఎం కావాలి.

**-విస్లావత్ హంసీ,కాకులగుట్టతండా,**
**మాచారెడ్డి మండలం.**



### కాంగ్రెస్ వద్దు.. కావలి కాసుడు వద్దు..

కాంగ్రెసోళ్లు పాలించినప్పుడు కరెంటు కోసం పొలాల్లోనే పడుకునేవాళ్లం. కరెంటు ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వదు. దీంతో అక్కడే కావలి కాసేటోళ్లం. కరెంటు సరిగ్గా రాక పంటలు ఎండిపోయేవి. ఇప్పుడు సీఎం కేసీఆర్ చేసుట్ల 24గంటలు కరెంటు వస్తుంది. అవసరమైనప్పుడల్లా నీళ్లు పారించుకుంటున్నం. గా కాంగ్రెసోళ్లు మళ్లీ వస్తే పాత రోజులు వస్తాయి. ఆ పార్టీ గెలిస్తే మూడు గంటల కన్నా ఎక్కువ కరెంటు ఇచ్చే పరిస్థితి లేదు. మా పక్కనే ఉన్న కర్ణాటకలో ఆ కాంగ్రెసోళ్లే అధికారంలో ఉన్నరు. అక్కడ ఇచ్చేది 5గంటల కరెంటే. ఆ కాంగ్రెస్ వద్దు.. వాళ్లిచ్చే కరెంటుతో పొలాల దగ్గర కావలి కాసుడు వద్దు.

**- విఠల్‌రెడ్డి, రైతు, మల్లూర్**

